నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
గురువారం 12, మార్చి 2026 పేజీలు:4

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



2



# ప్రజలకు అందించే తాగునీరు పూర్తిగా శుద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



- రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**కల్వకుర్తి, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 11:**

ప్రజల ఆరోగ్య జీవన ప్రమాణాలు మెరుగుపడేలా గ్రామాలు, పట్టణాల్లో నివసించే ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ అందించే తాగునీరు సురక్షితంగా ఉండేలా పూర్తిస్థాయిలో శుద్ధి చేసి సరఫరా చేయాలని నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్వకుర్తి పట్టణంలోని మిషన్ భగీరథ గ్రిడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మిగతా 2లో..

# మహిళలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



**సంగారెడ్డి, (నేటి ఫోకస్‌న్యూస్/బామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్)-మార్చి 11:**

సంగారెడ్డి జిలా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు రామచంద్ర పురం పట్టణంలో తన నివాసంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం మిగతా 2లో..



## ప్రజలకు అందించే తాగునీరు పూర్తిగా శుద్ధిగా ఉండేలా

# చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

60 ఎమ్ఎల్డీ సామర్థ్యం గల నీటి శుద్ధి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా త్రాగునీటి శుద్ధి ప్రక్రియ, నీటి శుద్ధి కేంద్రం పనితీరును సమగ్రంగా కలెక్టర్ పరిశీలించారు. నీటి శుద్ధి కేంద్రంలో నిర్వహిస్తున్న నీటి నాణ్యత పరీక్షలను కలెక్టర్ పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. శుద్ధి ప్రక్రియలో పాటిస్తున్న విధానాలు, నీటి నిల్వ ట్యాంకులు, ఫిల్టరేషన్ వ్యవస్థ, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల సామర్థ్యం తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. నీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలకు అందే త్రాగునీరు పూర్తిగా సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాగునీటి శుద్ధి ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలకు అందించే త్రాగునీరు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా త్రాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ నిర్వహించే నీటి పరీక్షల నివేదికలను క్రమం తప్పకుండా నమోదు చేసి భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. అలాగే రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కల్వకుర్తిలోని 60 ఎమ్ఎల్డీ సామర్థ్యం గల ఈ నీటి శుద్ధి కేంద్రం ద్వారా ప్రతిరోజూ కల్వకుర్తి మరియు అచ్చంపేట నియోజకవర్గాల్లోని సుమారు 460 గ్రామాలకు, అలాగే కల్వకుర్తి మున్సిపాలిటీకి రోజుకు సుమారు 50 మిలియన్ లీటర్ల తాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ అహ్మద్ హుస్సేన్, మిషన్ భగీరథ ఏఈ సంతోష్, తాహసిల్దార్ ఇతర అధికారులు సంబంధిత శాఖల అధికారులు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నా పొల్యూషన్ కంట్రోల్ డివైస్‌తో

# 80 శాతం కాలుష్యం మాయం

మార్గాన రామారావు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-మార్చి11:

మెట్రోపాలిటన్ నగరాలలో నానాటికి విస్తరిస్తున్న కాలుష్యం మానవ మనుగడకు ప్రమాదకరంగా మారింది అని సరికొత్త పొల్యూషన్ కంట్రోల్ డివైస్ రూపకర్త మార్గాన రామారావు అన్నారు. ఈ మేరకు సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను తయారుచేసిన సరికొత్త పొల్యూషన్ కంట్రోల్ డివైస్ ను ప్రదర్శించిన ఆయన ఆ డివైస్ కు ఇండియన్ పేటెంట్ సైతం రావడం పరికరం తాలూకు ప్రత్యేకత అని తెలియజేశారు. తాను గతంలో విశాఖపట్నంలోని నేవెల్ డాక్యార్డ్ లో వెహికల్ సూపర్వైజర్ గా పని చేసినప్పుడు అక్కడి పొల్యూషన్ గమనించిన తాను ఈ పరికరాన్ని అక్కడి వాహనాలకు బిగించగా 80 శాతం కాలుష్యం తగ్గిన విషయాన్ని గమనించి ఈ విషయాన్ని ప్రపంచానికి చెప్పాలని ఉద్దేశంతో దాదాపు 25 సంవత్సరాల పరిశ్రమతో ఇండియన్ పేటెంట్ రైట్ వచ్చిన ఈ పొల్యూషన్ కంట్రోల్ డివైస్ ను ప్రపంచానికి పరిచయం చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ పరికరాన్ని పరిచయం చేశానని ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా దీన్ని వాడుకలోకి తేవాలని ప్రయత్నం చేస్తున్నానన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని పొల్యూషన్ కంట్రోల్ డివైస్ తాలూకు వివరాలను పరిశీలించి కాలుష్యం తగ్గించడంలో తమ వంతు పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు.

# గ్యాస్ ధరల పెంపుపై ఆప్ నిరసన

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-మార్చి11:

పెరిగిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకులు నగరంలో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లు పక్కన పెట్టి కట్టెల పొయ్యిపై వంట చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆప్ నాయకులు మాట్లాడుతూ, వంట గ్యాస్ ధరలను పెంచి కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి కుటుంబాలపై భారాన్ని మోపిందని మండిపడ్డారు. పెరిగిన ధరల కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మకు చీర కట్టి గాజులు తొడిగుతూ నిరసన చేపట్టారు. వెంటనే వంట గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

## అత్తాపూర్‌లో కోట్ల విలువైన

# ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూమి కబ్జా

### హైడ్రా నే న్యాయం చేయాలని కోరుతున్న స్థానికులు

రాజేంద్రనగర్, (నేటి ఫోకస్ న్యూస్)-మార్చి11:

అత్తాపూర్ రాంబాగ్ లోని 354/టు354/4 వరకు గల సర్వే నెంబర్ లోనీ భూమిని ఒక వర్గం వాళ్లు ఒక్కరోజులో చుట్టూ రేకుల షెడ్ వేసి కబ్జా చేశారు. ఆర్డీఓ ఆఫీస్ కి 100 మీటర్ల, దూరంలో, పోలీస్ స్టేషన్ కి అర్థ కిలోమీటర్ దూరంలో, జిహెచ్ఎంసీ వార్డ్ ఆఫీస్ కి 10 మీటర్ల దూరంలో, ఎండోమెంట్ ఆఫీస్ కి 50 మీటర్ల దూరం లో ఉన్న ఈ స్థలాన్ని చెక్ చావుని గురుద్వారా కి సంబంధించిన వ్యక్తులు కబ్జా చేశారు. అధికారులు ప్రోద్బలం తో నే ఈ కబ్జా జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలం విషయంలో వెంటనే హైడ్రాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఈరోజు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. స్థానికంగా ఉన్న అత్తాపూర్ రామ్ బాగ్ హైదర్ గూడ పాండురంగ నగర్ ఉప్పరపల్లి పలు కాలనీవాసులు కలసి ఈరోజు ఉదయం నుంచి కబ్జా కి సంబంధించిన స్థలంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. దాదాపుగా 400 మంది యువకులతో పాటు పార్టీలకు అతీతంగా శివాలయం ముందు ధర్నా నిర్వహించారు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. విషయంపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరియు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆందోళన చేస్తున్న స్థలానికి వచ్చి రెండు వర్గాలతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించి ఇరు వర్గాల పత్రాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం అని హైడ్రా కమీషనర్ రంగంనాథ్ తెలిపారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఒరుగంటి సైదులు)-మార్చి 11:

తెలంగాణ రాష్ట్రం నుండి నూతనంగా రాజ్య సభ సభ్యులుగా ఎన్నికైన వేం. నరేందర్ రెడ్డిని కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులుగా గెలుపొందిన వేం నరేందర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపినారు. గతంలో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి సేవలు కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకునిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సలహాదారుడుగా అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేసినారని రాజ్యసభ సభ్యునిగా కూడా విజయవంతంగా సేవలు అందించి రాష్ట్ర అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఆకాంక్షించారు.



## మహిళలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. సందర్భంగా మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందుకే చేయడం జరిగింది. అదేవిధంగా మహిళలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా అధ్యక్షురాలు మాధురి ఆనంద్, కౌన్సిలర్స్ జిల్లా రాష్ట్ర పదాధికారులు బూత్ మరియు పట్టణ మండల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## పొత్తు లేకపోతే ఇంకా 60 సీట్లు వచ్చేవి

### సీపీఐ అంతర్మథనం

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-మార్చి 11:

కాంగ్రెస్ ప్రభుత్వం-పార్టీ తీరుపై మిత్ర పక్షం సీపీఐ స్టేట్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ మిత్రధర్మం పాటించలేదు - పద్ధతి మార్చుకోవాలని కమిటీ సూచించింది. మమ్మల్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు అవమానిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పద్ధతి మారకపోతే - పొత్తుకు దూరం అవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఒకటి రెండు జిల్లాలో మినహా సీపీఐ కి కాంగ్రెస్ సహకరించడం లేదు. కాంగ్రెస్ తో సీపీఐ పొత్తు ఉండాలా కొనసాగాలా అనే నిర్ణయం వాళ్ళకే వదిలేస్తున్నాం. భవిష్యత్ ఇలానే ఉంటే రెండు పార్టీలకు నష్టమేనని పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ అపాయింట్మెంట్ అడుగుతున్నాం. త్వరలోనే కలుస్తాం. కొత్తగూడెం ఎపిసోడ్ తో సీపీఐ - కాంగ్రెస్ మధ్య గ్యాప్ వచ్చింది. ఎంపీటీసీ - జడ్పీటీసీ ఎన్నికలకు ఒంటరిగా పోటీకి సిద్ధం అవుతున్నాం. పొత్తుతో ఉన్నాం కాబట్టే మొన్న వంద పంచాయతీలు గెలిచాం.. లేదంటే మరో 60 గెలిచేవాళ్లమని కమిటీ పేర్కొంది.

# సృజనాత్మకతను జోడిస్తూ మహిళలు ఆర్థికంగా వ్యాపార అభివృద్ధిని సాధించాలి

## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ మార్చి 11:** మహిళలు తమ ఆలోచనలు సృజనాత్మకతను జోడిస్తూ ఆకర్షణీయమైన ఉత్పత్తులను రూపొందించి ఆర్థికంగా మరింతగా అభివృద్ధి చెందాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. కల్వకుర్తి పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల నిర్వహణ అమలుపై కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ తో ఆరా తీశారు. మెప్మా మహిళా సంఘాల ఆధ్వర్యంలో వేస్ట్ మెటీరియల్‌ను వినియోగించి తయారు చేసిన వివిధ రకాల ఆకర్షణీయమైన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు వ్యర్థ పదార్థాలను వినూత్నంగా ఉపయోగించి తయారు చేసిన అలంకరణ వస్తువులు, గృహ వినియోగ వస్తువులు మరియు హస్తకళా ఉత్పత్తులను కలెక్టర్‌కు మహిళలు వివరించారు. ముఖ్యంగా పాత టైర్లను



వినియోగించి ఆకర్షణీయమైన పూల కుండీలు తయారు చేయడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. రంగురంగులుగా అల ంకరించి రూ పొందించిన ఈ పూల కుండీలు పర్యావరణ పరి రక్షణతో పాటు ఇంటి పరిసరాలను అందంగా తీర్చిదిద్దే విధంగా ఉన్నాయని కలెక్టర్ మహిళలను ప్రత్యేకంగా అభి నందించారు. మహిళల సృజనాత్మకతతో తయారైన ఈ వస్తువులను పరిశీలించిన కలెక్టర్ బాదావత్ సంతోష్ మహిళా సంఘాల సభ్యులను అభినందించారు.

వ్యర్థ పదార్థాలను పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు మహిళలకు అదనపు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల స్వయం ఉపాధికి దోహదపడటమే కాకుండా సమాజంలో పర్యావరణంపై అవగాహన పెంచడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మహిళలు తమ ప్రతిభను మరింతగా వినియోగించి ఇలాంటి సృజనాత్మక ఉత్పత్తులు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కల్వకుర్తి మున్సిపల్ కార్పొరేషన్ అహ్మద్ హుస్సేన్,సంబంధిత అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఉప్పల సహకారంతో ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ మార్చి 11:** కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన సరోజనమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని ఎల్లికట్ట గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న లిఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో ఎలికట్ట గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు మృతురాలు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉపసర్పంచ్ బలగం కేశవులు , కంఠం రవి, కృష్ణ,ఆంజనేయులు, జంగిలి,కంఠం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## 18వ వార్డ్ కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్



**నేటి పోకస్ న్యూస్ : భామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్ మార్చ్ 11**

సదాశివపేట మున్సిపాలిటీ 18వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ చెత్త సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..18వ వార్డు ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రైనేజీ శుభ్రపరచడం, చెత్తను తొలగించడం వంటి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ అధికారులు సిబ్బందితో కలిసి పనులను పూర్తిచేయిస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండే ప్రజా ప్రతినిధిగా వారి సేవలు అభినందనీయం. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదిన వేడుకలు




మా ఇంట్లో వెలిసిన వెన్నెల... మా కళ్ళల్లో మెరిసిన తారక...

మా ప్రియతమ పుత్రుడు అద్విత్ వర్మకు రెండవ పుట్టినరోజు శుభాకాంక్షలు. నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ...

**ప్రేమతో:**
**శ్రావణ్ - నవ్య (తల్లిదండ్రులు)**
**ఆర్యన్ వర్మ (తమ్ముడు)**
**సుజాత (అమ్మామ్మ )**
**కావ్య( పిన్ని)**
**మరియు బంధుమిత్రులు.**

# జిల్లా అర్చగా సంగం ఆధ్వర్యంలో నూతన పంచాంగం ఆవిష్కరించారు

**ఫోకస్ న్యూస్ : భామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్ మార్చ్ 11**





కొలనుభారతి పంచాంగ ఆవిష్కరణ సంగారెడ్డి జిల్లా జంగమ అర్చక పురోహితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదశివపేటలోని స్థానిక పెద్ద మఠం నందు అర్చకుల సమక్షంలో నూతన పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించరూ. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా జంగమ పురోహిత అర్చక సంఘం అధ్యక్షులు మడుపతి సంతోష్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించరూ. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బసవలింగస్వామి, కోశాధికారి శివప్రసాద్ స్వామి, కార్యచరణ అధ్యక్షులు అయ్యప్ప స్వామి,సలహాదారు నాగస్వామి అలాగే ప్రవీణ్ స్వామి వీరస్వామి నరేష్ స్వామి పెద్దమఠం లింగానంద స్వామి శివకోటి స్వామి ప్రతి సంవత్సరం కూడా వీటి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జంగం అప్పుడు ఇతర సంక్షేమ సంఘాన్ని అభివృద్ధి పరిచయంలో సంగారెడ్డి జిల్లా అర్చకులు ముందుండి పాల్గొనడం జరుగుతుంది



# బిస్వాల్ కమిటీ సీఎంకు గుర్తు లేదా

## ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలి

**ఫోకస్ న్యూస్ : బామిని రఘుపతి స్టేట్ కోఆర్డినేటర్ మార్చ్ 11**

మండలిలో నిరుద్యోగుల గొంతుకనవుతా నిరుద్యోగులను దగా చేసిన కాంగ్రెస్ టీజీపీఎస్సీ ని కలిసిన ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి బుర్ర వెంకటేశంకు వినతి పత్రం అందజేత రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ బుర్ర వెంకటేష్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఎన్నికల ముందు ఇప్పుడు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బిస్వాల్ కమిటీ అని తరచూ ప్రస్తావించేవాడని , వచ్చిన తర్వాత సీఎంకు బిస్వాల్ కమిటీ గుర్తుకు రావడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకం చేపట్టిన ఉద్యోగులపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్టంలో గ్రూప్ 1,2,3,4 ఉద్యోగ ప్రకటనలతో పాటు సీడిపీవో, విద్యుత్ శాఖలో ఏఈ, ఏ ఈఈ, వ్యవసాయ శాఖలో ఏవో, ఏఈవో, రవాణా శాఖలో ఏ ఎమ్ వి ఐ, పారెస్ట్ డిపార్ట్మెంట్ లో ఎఫ్ బి ఓ, ఎఫ్ ఎస్ ఓ, ఎఫ్ ఆర్ వో , లతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జూనియర్ లెక్చరర్, పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉన్నత విద్యను మరింత బలోపేతం చేయాలని ఆయనను కోరారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగుల పక్షాన తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వచ్చే బడ్జెట్ సెషన్ లో నిరుద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తామన్నారు. దీనికి టీజీపీఎస్సీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు అంజిరెడ్డి తెలిపారు.

# విద్యాసంస్థ పరువు తీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించం, గురుకుల ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలి







## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ మార్చి 11:**

విద్యాసంస్థ పరువు తీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, గురుకుల ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురుకుల ఉపాధ్యాయులను హెచ్చరించారు. బుధవారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వెల్దండ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంఘిక గురుకుల పాఠశాలలో బాలికలతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు. తప్పనిసరిగా ప్రభుత్వం అందించిన కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, వండిన ఆహారపదార్థాలు ప్రతి ఒక్కరికి కడుపునిండా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు.స్టోర్ లో సరుకులు చెక్ చేశారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలని సూచించారు. విద్యార్థులతోఆప్యాయంగా పలకరించి ఆహారం ఎలా ఉంది, రుచిగాఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ సందర్భంగా పాఠశాలలో బోధన విధానం, విద్యార్థుల సౌకర్యాలు, భౌతిక వసతులు, క్రమశిక్షణ మరియు నిర్వహణ పరిస్థితులను వివరంగా పరిశీలించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ...., గురుకులాల ఉపాధ్యాయులు తమ బాధ్యతలను నిబద్ధతగా నిర్వర్తించి, విద్యార్థుల విద్యా అభ్యున్నతికి మాత్రమే కృషి చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎవరికి ఇబ్బందులు కలిగించకూడదని, సంస్థ, పాఠశాల పరువు తీసేలా లేదా ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించరాదు అని కలెక్టర్ హెచ్చరించారు. గురుకులాల్లో ఏమైనా సమస్యలు ఉంటే, వాటిని తక్షణమే ఉన్నతాధికారులు, లేదా తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా, వ్యక్తిత్వ, నైతిక అభివృద్ధికి మరింత కృషి చేయాలని, గురుకులాల్లో క్రమశిక్షణ, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఉపాధ్యాయుల అంతర్గత విభేదాల కారణంగా విద్యాసంస్థల పరువు తీయకూడదు అని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే విషయాలను ఎవ్వరూ కల్పించిన ఉపేక్షించబడును కలెక్టర్ స్పష్టం చేశారు. ఇటీవల కేజీబీవీ లో జరిగిన ఘటనలపై కొంతమందిని ఉద్యోగం నుండి శాశ్వతంగా టర్మినేషన్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి తప్ప రోడ్డుపైకి విద్యార్థులను పంపడమేమిటని కలెక్టర్ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. సమస్యలు ఉంటే బయట పరిష్కరించుకోండి పాఠశాలలో సమస్యలు సృష్టించి విద్యార్థులకు ఆటంకం కలిగించొద్దని కలెక్టర్ ఆదేశించారు. ఇకపై ఇలాంటి విషయాలపై సహించబోమని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు కొనసాగుతున్నందున వారి విద్యాభ్యాసం పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంటే కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, వెల్దండ తహసిల్దార్ కార్తీక్ కుమార్, వెల్దండ ఎంపీడీవో కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# మస్జిద్ కమిటీని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్

**నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చ్ 11**

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక జమా మస్జిద్ కమిటీని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రకటించడం జరిగింది. అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్ అలీమ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ మౌలానా పాషా,మహమ్మద్ షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అమీర్, కోశాధికారిగా మహమ్మద్ గౌస్ మైనోద్దీన్, కమిటీ మెంబర్స్ గా మమ్మద్ యాకుపాషా, ఎస్డి చాంద్ పాషా,మహమ్మద్ అబ్దుల్ గని,మహమ్మద్ ఎజాజ్, మహమ్మద్ అమీనుల్ ఇస్లాం,మహమ్మద్ సలామ్ పాషాల ను ప్రకటించినట్లు నియామక పత్రాన్ని మహబూబాబాద్ జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ నజీముద్దీన్ చేతుల మీదుగా తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్, ఉపాధ్యక్షుడు మౌలానా పాషా, ప్రధాన కార్యదర్శి అమీర్లు సంయుక్తంగా మాట్లాడుతూ తొర్రూర్ జమా మస్జిద్ కమిటీని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్, సిఈవోకు, మహబూబాబాద్ జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ నజీముద్దీన్ కి కమిటీ పక్షాన ధన్యవాదాలు తెలియజేసుకుంటూ మస్జిద్ అభివృద్ధి కొరకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని పేర్కొంటూ జమా మస్జిద్ కు సంబంధించిన వక్ఫ్



ఆస్తుల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యతను కల్పిస్తూ పట్టణ మరియు మండలంలోని ముస్లిం సోదరుల సంక్షేమం కోసం స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహాయ సహకారాలతో కృషి చేస్తామని తెలుపుతూ ముస్లిం సోదరులందరికీ కలుపుకొని ముందుకు వెళ్దామని అంటూ కమిటీ ఏర్పాటుకు పూర్తి సహకారం అందించిన స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డికి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్టీసీ డ్రైవర్ షేక్ యాకూబ్ పాషా కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ అతని కుటుంబానికి కమిటీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు.